క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

పెదపూడి: మండలంలోని 18 గ్రామాల్లో గల రైతు సేవా కేంద్రాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి టీవీఆర్ మణిదీప్ తెలిపారు. ఆయన గురువారం దోమాడ, పెదపూడి గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలను సందర్శించారు. 75 కేజీల ధాన్యానికి రూ.1725, ఏ గ్రేడ్ రకానికి రూ.1740 మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మండలంలో సుమారు 18 వేల ఎకరాల్లో వరిసాగు చేశారన్నారు.

వివాహితకు కట్నం వేధింపులు

పెదపూడి: కట్నం వేధిస్తున్నారంటూ వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అదనపు ఎస్సై బి.దుర్గాప్రసాద్ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అనపర్తి మండలం మహేంద్రవాడకు చెందిన పి.లక్ష్మీప్రసన్నకు పశ్చిమ గోదావరి జిల్లా ఉంగుటూరు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన ధనరాజుతో ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. అయితే ఇటీవల అదనపు కట్నం కోసం లక్ష్మీప్రసన్నను భర్త ధనరాజు, మామ హనుమంతరావు, అత్త ధనలక్ష్మి మానసికంగా వేధింపులకు గురి చేశారు. ఈ నేపథ్యంలో ఆమెను పుట్టింటికి పంపించేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు గృహ హింస, కట్నం వేధింపులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రంగంపేట ఎస్సైగా శివ ప్రసాద్



రంగంపేట: ఎస్సైగా ఎస్.శివ ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. రాజమహేంద్రవరంలోని ప్రకాశం నగర్ పోలీస్ స్టేషన్‌లో పని చేసిన ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా రంగంపేట స్టేషన్‌కు వచ్చారు. ఇప్పటి వరకు రంగంపేటలో పనిచేసిన తోట కృష్ణసాయి విజయవాడ విజిలెన్స్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శివ ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలు కాపాడేందుకు కృషి చేస్తానన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కలవచర్లలో మందుల సీజ్

రాజానగరం: మండలంలోని కలవచర్లలో మెడికల్ రిప్రజెంటేటివ్ ఎ.విష్ణుమూర్తి వద్ద లెసెన్సు లేకుండా ఉన్న అబార్షన్ కిట్లు, వయాగ్రా టాబ్లెట్లను సీజ్ చేశామని డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ పి.కల్యాణి తెలిపారు. మెడకల్ షాపుల తనిఖీలలో భాగంగా పాలకొల్లులోని ఒక దుకాణంలో ఈ మందులు దొరికాయన్నారు. వాటిని విష్ణుమూర్తి అనధికారికంగా సరఫరా చేస్తున్నాడని తెలుసుకుని, కలవచర్లలో ఆయన ఇంట్లో తనిఖీ చేశామని తెలిపారు. ఈ సందర్భంగా పైన తెలిపిన మందులు దొరకడంతో సీజ్ చేశామన్నారు. వీనిపై రిపోర్టును ఏడీకి పంపించనున్నారు.

ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్ష

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్పెషల్ ఆఫీసర్ బి.రామ్ ప్రసాద్ గురువారం హౌసింగ్ పురోగతిపై సమీక్షించారు. ఎంపీడీవో ఎం.భారతి, హౌసింగ్ ఏఈ అడ్డాల నాగ చక్రంతో కలిసి మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్ ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో మే నెలాఖరుకు 194 ఇళ్లు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. హౌసింగ్ ఏఈ నాగ చక్రం మాట్లాడుతూ మండలంలో బేస్‌మెంట్ లెవెల్‌కు 25, లింటల్ లెవెల్‌కు 118, రూఫ్ లెవెల్‌కు 56, శ్లాబ్ వేసినవి 5 ఇళ్లు ఉన్నాయన్నారు. వీటిలో బీసీ, ఎస్సీలకు రూ 50 వేలు, ఎస్టీలకు రూ. 75 వేలు చొప్పుడు అదనపు మొత్తం రూ.22.98 లక్షలు వచ్చిందని వివరించారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

కోరుకొండ: వ్యవసాయ రంగంలో వచ్చిన ఆధునిక పద్ధతులను రైతులకు తెలియజేయాలని విద్యార్థులకు వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ శ్రీనివాస్ సూచించారు. మండలంలోని శ్రీరంగపట్నంలో జరుగుతున్న వ్యవసాయ విద్యార్థుల ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా రైతు సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారులు, వ్యవసాయ కళాశాల అధ్యాపకులు, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

పెదపూడి: వేసవి ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా గ్రామ సచివాలయ కార్యదర్శులు అన్ని చర్యలు చేపట్టాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సచివాలయ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ప్రజలు వినియోగించుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. వేసవిలో నీటి ఎద్దడి నెలకొనే గ్రామాల్లో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి ప్రతి గ్రామంలో ఉదయం, సాయంత్రం రాజ్యాంగబద్ధమైన గ్రామ సభలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శులు మన్యం శ్రీనివాస్ చౌదరి, యాళ్ల ఉమా మహేశ్వరరావు, బి.ప్రసన్న ఆంజనేయులు, నాగేంద్ర, సూర్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేసవి కాలం.. వ్యాధుల గాలం

- వ్యాధులపై అప్రమత్తత అవసరం
- పరిశుభ్రత పాటించాలంటున్న వైద్యులు



బిక్కవోలులో వైద్యం కోసం వేచి ఉన్న రోగులు

బిక్కవోలు: వేసవి కాలం ప్రారంభమైందంటే చాలు ఒక్కో వ్యాధి మెల్లగా జడలు విప్పడం మొదలు పెడుతుంది. ముఖ్యంగా మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఆటలమ్మ (పొంగు, చికెన్ పాక్స్), గవద బిళ్లలు, అతిసార, విష జ్వరాలు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుంది. దీంతో ఆసుపత్రుల్లో అధిక సంఖ్యలో రోగులు కనిపిస్తుంటారు. చిన్న పిల్లల్లో సాధారణంగా కనిపించే ఈ వ్యాధులు నీరు, గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంటాయని వైద్యులు చెబుతున్నారు. .

నియోజకవర్గంలో..

నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లో 58 గ్రామాలు, 79 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో పదేళ్ల లోపు చిన్నారులు 40 వేల మంది వరకూ ఉంటారు. ఈ వేసవిలో వారి విషయంలో మరింత శ్రద్ధ చూపాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. ఎండ తీవ్రత, నీటి ఎద్దడి కారణంగా తాగునీరు కలుషితమవుతుంది. కలుషిత ఆహారం, తాగునీరు కారణంగా సంభవించే అతిసార ప్రాణాంతకమైంది. వేసవిలో ఈ వ్యాధి కేసులు అధికంగా నమోదువుతుంటాయి. కాచి చల్లార్చిన నీరు తాగడంతో వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చు. ఇటీవల రంగంపేట మండలంలోని పాత వీరంపాలెం గ్రామంలోని డయేరియా కలకలం రేపింది. సుమారు ఆరుగురి పైగా వాంతులు, విరేచనాలతో బాధపడ్డారు. దీంతో ఉన్నతాధికారులు ఇంటింటి సర్వే నిర్వహించి, అతిసార రోగులను గుర్తించి వాటి వైద్య సేవలు అందించారు. వాటర్ ట్యాంకులు, కాలువలను శుభ్రం చేసి హడావుడి చేశారు. ఈ తరవాత వదిలేయడంతో పరిస్థితి మొదటికి వచ్చినట్టుందని గ్రామస్తులు చెబుతున్నారు.

గవద బిళ్లలు

గవద బిళ్లల వ్యాధి సోకితే గొంతు నొప్పి ఉంటుంది. మింగలేని పరిస్థితితో నిస్సత్తువ, నీరసం, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు ఉంటాయి. వేడి తీవ్రతతో శరీరంలో నీటి శాతం తగ్గుతుంది. నోటిని శుభ్రంగా ఉంచుకోవాలి. శక్తిని అందించే పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలి. ఓఆర్ఎస్ వంటి ద్రావణాలు తీసుకోవడం మంచిది.

అనపర్తి నియోజకవర్గం	
జనాభా	2.72 లక్షలు
గ్రామ పంచాయతీలు	58
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	7
సామాజిక ఆరోగ్య కేంద్రాలు	2
హెల్త్ క్లినిక్	60
ప్రభుత్వం వైద్యశాలలకు నిత్యం వచ్చే రోగులు	1200 మంది

విష జ్వరాలు

కలుషిత నీటిని తాగడం వల్ల టైఫాయిడ్, దోమకాటు, ఇతర సమస్యలతో విష జ్వరాలు సోకుతాయి. జ్వరం వస్తే అదే తగ్గిపోతుందన్న అపోహను వీడాలి. వైద్యులను సంప్రదించి పరీక్షల ద్వారా క్రమ పద్ధతిలో చికిత్స పొందాలి. శీతల పానీయాలకు దూరంగా ఉండాలి.

ఆటలమ్మ

ఆటలమ్మ (పొంగు) వ్యాధి వస్తే జ్వరం, నీరసం వచ్చి శరీరంపై నీటి పొక్కులు ఏర్పడతాయి. వ్యాధిగ్రస్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతారు. వారం నుంచి 14 రోజుల వరకూ ప్రభావం చూపుతుంది. ఇది అంటువ్యాధి కావడంతో సోకిన వారు మిగిలిన వారికి దూరంగా ఉండటం మంచిది. వ్యాధి సోకిన పిల్లలను పాఠశాలకు పంపకూడదు. దురదలు రాకుండా పరిశుభ్రతగా ఉంచాలి. ఆటలమ్మ వచ్చిన వారికి కోరినవన్నీ ఇవ్వాలన్న అపోహతో అన్ని రకాల తినుబండారాలు ఇవ్వడం మంచిది కాదు. తెలికగా జీర్ణమయ్యే పౌష్టికాహారం అందించాలి.

నాటు వైద్యం ప్రమాదం

ఆటలమ్మ పట్ల అపోహలు, మూఢ నమ్మకాలు పెట్టుకోకూడదు. చాలా మంది మూఢ నమ్మకాలతో వైద్యం తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తుంటారు. ఇది మంచిది కాదు. చిన్న పిల్లల్లో ఈ వ్యాధి తీవ్రత ఓ మోస్తరుగా ఉంటే పెద్దల్లో అధికంగా ఉంటుంది. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే మెదడు, ఊపిరితిత్తులపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

వైద్యులను సంప్రదించాలి



అతిసార, ఆటలమ్మ గవద బిళ్లలు, విష జర్వాలు సోకినప్పుడు నిర్లక్ష్యం చూపకూడదు. జాగ్రత్తలు పాటిస్తే మంచిది. నాటు వైద్యం మరింత ప్రమాదకరం. వేసవిలో దాహార్తిని తట్టుకోలేక అపరిశుభ్రత, చల్లని పానీయాలు తాగడం శ్రేయస్కరం కాదు. శుభ్రతను పాటిస్తూ కాచి చల్లార్చిన నీటిని తాగడం మంది. వ్యాధి సోకితే ముందస్తు జాగత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ జి.విజయలక్ష్మి, కొంకుదురు పీహెచ్‌సీ వైద్యులు

జాగ్రత్త అవసరం



ఒకటి, రెండు రోజులకు మించి జ్వరం ఉంటే వెంటనే వైద్యులను సంపద్రించాలి. వేసవిలో పిల్లలకు జ్యూస్‌ల రూపంలో ఎక్కువగా ఆహారం అందించాలి. సాయంత్రం ఐదు దాటిన తర్వాత ఆటలు ఆడుకోవడానికి పంపించడం మంచిది. నీటి శాతం ఎక్కువగా ఉండే ఆహారం ఇవ్వడం ఆరోగ్యానికి మంచింది.

– పులగం రామానంద సాగర్, చిన్నపిల్లల నిపుణుడు, అనపర్తి

బీజేపీ ఆధ్వర్యంలో 'పల్లెకు పోదాం'



రంగంపేటలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

రంగంపేట: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం బీజేపీ నాయకులు పల్లెకు పోదాం (గావ్ ఛలో) కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా రంగంపేట, వెంకటాపురం, సుభద్రంపేట, ముకుందవరం, నల్లమిల్లి, పెద రాయవరం, కోటపాడు, సింగంపల్లి, దొంతమూరు, ఈలకొలను గ్రామాలను సందర్శించారు. ఆయా గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలైన ఉపాధిహామీ, అంగన్‌వాడీ, ముద్రా రుణాలు, మిషన్ వాత్సల్య, ఆయుష్మాన్ మందిర్ అమలు తీరును తెలుసుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు మైలవరపు సాయిరాం, కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబరు మండవిల్లి గుప్తా, మండల కిసాన్‌మోర్చా కన్వీనర్ పోతుల వీరన్న, బోడెం రాంబాబు, మాణిక్యం, ఆంజనేయులు, పెండ్యాల బుజ్జిబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నల్లమిల్లి పిల్లిమొగ్గలు దేనికో?

- చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌పై ఆయన వైఖరి ఏమిటి?
- మరో గ్రాసిమ్ నాటకానికి తెర తీశారా?
- ధ్వజమెత్తిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: బిక్కవోలు మండలం బలభద్రపురం సమీపంలోని కాపవరం గ్రామ పంచాయతీ పరిధిలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయ తలపెట్టిన చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్ ఏర్పాటు విషయంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పిల్లిమొగ్గలు ఎందుకు వేస్తున్నారని వైఎస్సార్ సీపీ అనపర్తి నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రశ్నించారు. అనపర్తిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో బీజేపీ తరఫున ఎమ్మెల్యేగా ఉన్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదా అన్నారు. లేక మరో గ్రాసిమ్ నాటకానికి తెర తీశారా అని సందేహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఎమ్మెల్యే నల్లమిల్లి తన స్వార్థం కోసం అసెంబ్లీలో కేన్సర్ ప్రస్తావన తెచ్చి ఈ ప్రాంత ప్రజల ఆరోగ్యంపై ఎన్నో అపోహలు సృష్టించారన్నారు. మళ్లీ ఈ చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి పరిశ్రమ ఏర్పడితే నిజంగానే ఈ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిస్థితి దెబ్బతింటుందన్నారు.

ఆంతర్యమేమిటి

చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి రాష్ట్ర మంత్రి నారాయణ ఈ ప్రాంతంలో పర్యటించడం, మరోపక్క ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ప్లాంట్ ఏర్పాటు జరగనివ్వను అని అనడం ఏమిటో తెలియడం లేదని సూర్యనారాయణరెడ్డి అన్నారు. ప్లాంట్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు మొదలుపెట్టి 2 నెలలు కావస్తున్నా ఈ ప్లాంట్‌ను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ స్పందించిన తర్వాతే ఎమ్మెల్యే నల్లమిల్లి దీనిపై మాట్లాడటంలో ఆంతర్యం ఏమిటని మండిపడ్డారు. కాపవరం గ్రామ పంచాయతీ పాలకమండలి తీర్మానం ప్లాంట్‌కు అనుకూలంగా చేయాలని ఉన్నత అధికారుల ఒత్తిడి చేయడం ఎమ్మెల్యేకు తెలియదా అని ప్రశ్నించారు. ప్లాంట్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ తీర్మానం చేసిన సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణను, గ్రామ పంచాయతీ పాలకమండలిని ప్రత్యేకంగా అభినందిస్తున్నానన్నారు. ఈ ప్రాంతంలో వ్యర్థాల నుంచి విద్యుత్ ప్లాంట్ ఏర్పాటైతే జిల్లాలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలకు చెందిన చెత్తను వందల వాహనాల్లో ఈ ప్రాంతానికి తరలిస్తారన్నారు. దీనివల్ల ఈ ప్రాంత ప్రజల ఆరోగ్యం దెబ్బతినే అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

రాజానగరం: వార్షిక మరమ్మతుల్లో భాగంగా మండలంలోని జి.యర్రంపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. ఈ కారణంగా హెచ్‌టీ 33 కేవీ కోకో కోలా సర్వీసు, కొత్త తుంగపాడు, పాత తుంగపాడులలో వ్యవసాయ, గృహ అవసరాలతో పాటు అన్ని రకాల సర్వీసులకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు.

సీతానగరం: మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని రాజమహేంద్రవరం రూరల్ ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. 11 కేవీ సీతానగరం రూరల్ ఫీడర్ లైన్ మరమ్మతులు, చెట్లకొమ్మల తొలగింపు కోసం విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. దీనితో వంగలపూడి, సింగవరం, పెద కొండేపూడి, చీపురుపల్లి, అచ్చయ్యపాలెం గ్రామాలకు, అలాగే ఉపకేంద్రం పరిధిలోని వ్యవసాయ బోర్లకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 వరకూ విద్యుత్ ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కోరుకొండ: నరసాపురం సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కోసం శుక్రవారం సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీడీపీఎల్ ఈఈ శ్రీధర్ వర్మ గురువారం తెలిపారు. 33/11 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా నరసాపురం, గాదరాడ, కనుపూరు, రాజవరం గ్రామాలకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ ఉండదన్నారు.

కూటమి తీరుపై భవన నిర్మాణ కార్మికుల నిరసన




డిమాండ్లు నెరవేర్చాలని నిరసన తెలుపుతున్న కార్మికులు

- డిమాండ్లు నెరవేర్చకపోతే మే 5 నుంచి ఉద్యమం
- ఎన్నికల హామీలను నెరవేర్చాలంటూ నినాదాలు

సీటీఆర్ఐ: తమ ఇబ్బందులు, ఆవేదన, సమస్యలపై కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న మొండి వైఖరికి నిరసనగా భవన నిర్మాణ కార్మికులు గురువారం నిరసన తెలిపారు. స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘాల సమాఖ్య అధ్యక్షుడు బొజ్జా రామకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 2024 మేనిఫెస్టోలో వంద రోజుల్లో కార్మికులకు న్యాయం చేస్తామని చెప్పారన్నారు. వారు అధికారంలోకి వచ్చి పది నెలలు కావొస్తున్నా, ఇంత వరకూ నెరవేర్చలేదన్నారు. తక్షణం స్పందించి భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేయాలని, లేకపోతే మే 5వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలియచేస్తామన్నారు. సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని, చెస్ విధానం ద్వారా వసూలు చేస్తున్న సొమ్మును కార్మికులకే వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి రాజన్నబాబు, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల పుష్పయాగం



సీతమ్మ తల్లికి సమర్పించిన సారె

బిక్కవోలు: పందలపాక వెలంపేట రామాలయంలో గురువారం సీతారాముల పుష్పయాగం నిర్వహించారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని ఐదు రోజుల తర్వాత ఈ కార్యక్రమం జరిపారు. ఈ సందర్భంగా కాజాలు, చలివిడి, చిలకలు, అరిసెలు, సున్నుండలు, లడ్డూ, పాలకోవా తదితర 58 కేజీల స్వీట్లు, పండ్లు, పసుపు, కుంకుమను సీతమ్మ తల్లికి సారెగా మహిళలు అందజేశారు. స్వామివారి తల్లిదండ్రులుగా పైల శ్రీహరి కృష్ణ, అరుణకుమారి దంపతులు వ్యవహరించారు. ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవ విగ్రహాలను పూల పల్లకీలో ఉంచారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గొర్రిపోటి వెంకటరమణ, వెన్నల శివ, కొల్లి దేవి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

వెటర్నరీ వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచాలి



వెటర్నరీ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ

రాజానగరం: పాడి పశువుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా అవసరమైన మందులను గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో (ఆర్ఎస్‌కే) అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సూచించారు. వెటర్నరీ అధికారులతో గురువారం ఆయన సమీక్షించారు. వెటర్నరీ వ్యాక్సిన్లు ఆర్ఎస్‌కేలలో అందుబాటులో ఉండటం లేదని తన దృష్టికి వచ్చిందన్నారు. ఇకపై అటువంటి సమస్య రాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పశుగ్రాస విత్తనాలు, దాణాలపై ఆరా తీశారు. తోకాడ, నరేంద్రపురంలో వెటర్నరీ డిస్పెన్సరీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జిల్లా వెటర్నరీ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు, ఏడీలు, వీఏఎస్‌లు పాల్గొన్నారు.

జీవ కారుణ్య సంఘానికి రూ.50 వేల వితరణ



చెక్కు అందజేస్తున్న దాతలు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరానికి చెందిన స్వర్గీయ అంగటి ప్రకాశరావు (ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల) జ్ఞాపకార్థం ఆయన కుమారులు రమేష్, సురేష్, రాజేష్ గురువారం రూ.50 వేలను గురువారం గౌతమీ జీవకారుణ్య సంఘంలో నిత్యాన్నదాన పథకానికి వితరణ చేశారు. ఈ మేరకు జీవ కారుణ్య సంఘం అధికారి రాజుకు చెక్కు అందించారు. గతంలో వీరి అమ్మ అంగటి పార్వతి జ్ఞాపకార్థం రూ.50 వేలను అందజేశారు.

వసతి గృహాల సందర్శన


కంబాలచెరువు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీలక్ష్మి గురువారం నగరంలోని పలు సంక్షేమ వసతి గృహాలను సందర్శించారు. ఆవ రోడ్డులోని ఏకలవ్య బాలల వసతి గృహం, బొమ్మూరులోని బాలికల శిశు గృహ వసతి గృహాలకు వెళ్లి, అక్కడ సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం వసతి గృహాల సిబ్బందికి పలు సూచనలు చేశారు.

'గట్టి' సోదరులకు పలువురి పరామర్శ

కడియం: పితృ వియోగంతో బాధపడుతున్న గట్టి సుబ్బారావు, నరసయ్యలను గురువారం పలువురు పరామర్శించారు. వారి తండ్రి సత్యనారాయణ మూర్తి మృతికి సంతాపం తెలిపారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. గట్టి సోదరులను పరామర్శించిన వారిలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, కాపు సంఘం నాయకులు ఆకుల రామకృష్ణ, ఐఎస్ఏ మాజీ అధ్యక్షుడు పల్ల సుబ్రహ్మణ్యం, వైస్ ఎంపీపీ పంతం గణపతి, కలిదిండి విశాలాక్షి గోవిందు, దుళ్ల ఉపసర్పంచ్ తోకల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు పుల్లా రామారావు, ఈదర పాపారావు, ఆత్రేయపురం తహసీల్దార్ రాజేశ్వరరావు, నిడదవోలు సీఐ తిలక్, డా. పరిమి సత్య ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఉప్పలూరి సేవలు అభినందనీయం

- జన్మదిన వేడుకల్లో మాజీ మంత్రి వేణు, జక్కంపూడి రాజా
- పలు సేవా కార్యక్రమాల నిర్వహణ



ఉప్పలూరి సత్యనారాయణకు మొక్క అందజేసి శుభాకాంక్షలు చెబుతున్న వేణు, జక్కంపూడి రాజా, గణేష్

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ ఉప్పులూరి వీర వెంకట సత్యనారాయణ సేవలు అభినందనీయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాజానగరం మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా కొనియాడారు. ఉప్పులూరి వీర వెంకట సత్యనారాయణ జన్మదిన వేడుకలను గురువారం వెంకటనగరం, తొర్రేడు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయన అభిమానులు తొర్రేడు, వెంకటనగరం, రాజమహేంద్రవరంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు జరిపారు. ఆలయాల్లో పూజల అనంతరం సర్వమత ప్రార్థనలు చేశారు. వెంకట నగరం సెంటర్‌లో చలివేంద్రం ప్రారంభించారు. తొర్రేడులోని బాలాజీ టౌన్ షిప్‌లో జరిగిన కార్యక్రమంలో సత్యనారాయణ కేక్ కట్ చేశారు. ఆయనకు వేణు, జక్కంపూడి రాజా, జక్కంపూడి గణేష్ పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. ప్రయాణికులకు మజ్జిగ, చెరకు రసం పంపిణీ చేశారు. లాలాచెరువులోని స్వర్ణాంధ్ర ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం, జియోన్ పాఠశాలలో పిల్లలకు అన్నదానంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. వెంకట నగరం శివాలయం వద్ద నిర్మించిన కమ్యూనిటీ హాలును జక్కంపూడి గణేష్‌తో కలిసి ఉప్పులూరి ప్రారంభించారు. తొర్రేడు హరిజనపేటలో వైద్య శిబిరం, చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప్పులూరి భిమానులు, తొర్రేడు, వెంకటనగరం, కాతేరు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా సోమాలమ్మ జాతర



సోమాలమ్మ జాతరలో గరగ నృత్యాలు



ఆకట్టుకున్న శక్తి వేషధారణ

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యిలోని బుచ్చయ్య నగర్‌లో కొలువైన సోమాలమ్మ జాతర గురువారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని గరగ నృత్యాలు, శక్తి వేషధారణలు, కోయనృత్యాలు, వివిధ వేషధారణలతో వీధుల్లో ఊరేగించారు. అనంతరం నూతనంగా నిర్మించిన ఆలయానికి తీసుకువచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.